క్లుప్తంగా

పేదలకు అన్నదానం



తెనాలి అర్బన్: ఎమ్మార్పీఎస్ నాయకులు పమిడిపాటి కోటయ్య మాదిగ జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు ప్రసాద్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి వారి అన్నదాన కేంద్రంలో పేదలకు శుక్రవారం అన్నదానం చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కాంగ్రెస్‌పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ.. కోటయ్య మాదిగ బడుగు, బలహీన వర్గాలకోసం అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, దూరు వీరయ్య, మల్లవరపు ఆనంద్, శీలం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్ల అద్దాలు అందజేత



తెనాలి అర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ప్రవాసా భారతీయుడు కొత్తపల్లి కృష్ణమోహన్ సహకారంతో మారీసుపేట ఎన్‌సీఆర్ ఎన్‌ఎంహెచ్ స్కూల్, పెదరావూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం 175 కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్, ఈదర శ్రీనివాసరావు, మల్లాది అర్జున్, పాలడుగు సురేంద్ర, కన్నెగంటి మురళీకృష్ణ, ఆలపాటి కిరణ్‌చౌదరి, వీరవల్లి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

వాహన యజమానులకు కౌన్సెలింగ్



తెనాలి రూరల్: తెనాలిలో గురువారం రాత్రి నిర్వహించిన వాహన తనిఖీలలో సీజ్ చేసిన వాహన యజమానులకు డీఎస్పీ జనార్దనరావు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎస్పీ కార్యాలయం వద్దకు వాహనదారులను పిలిపించి వారితో మాట్లాడారు. సీజ్ చేసిన వాటిలో సరైన నంబర్ ప్లేట్లు లేని అనేక వాహనాలను గుర్తించామని ఆయన తెలిపారు. పట్టణ పరిధిలో వాహనాల తనిఖీ కొనసాగుతుందని.. యజమానులు సరైన పత్రాలు కలిగి ఉండడంతో పాటు అందరూ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు.

విద్యుత్ ఏఈగా గోపీ బాధ్యతల స్వీకరణ



దుగ్గిరాల: మండల విద్యుత్ ఏఈగా కాపారపు గోపీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో వేమూరు మండలంలో పని చేశారు. ఇంత వరకు ఏఈగా పని చేసిన సీహెచ్. వసంతరావు పల్నాడు జిల్లాకు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన గోపీకి సిబ్బంది అభినందనలు తెలిపారు.

మహిళలు సవాళ్లకు ఎదురొడ్డి ఎదగాలి

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో శుక్రవారం మహిళల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కేఎల్‌యూ న్యాయ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ మెగా ఊజా మాట్లాడుతూ మహిళా సాధికారతకు ఎదురవుతున్న సవాళ్లను అధిగమించి జీవితంలో ఎదగాలని సూచించారు. భారతదేశంలో మహిళల హక్కుల విధాన సంస్కరణలు, అట్టడుగు స్థాయి క్రియాశీలత, న్యాయపరమైన జోక్యం వంటి పలు అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రో వీసీలు కె. రాజశేఖరరావు, ఎ.వి.ఎస్. ప్రసాద్, ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి కె.ఆర్.ఎస్. ప్రసాద్, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ కె. రూతు రమ్య, పూర్వ విద్యార్థులు విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ కె. సోని, న్యాయకళాశాల విభాగాధిపతి పి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

మంగళగిరి: పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త గోలి రామాంజనేయులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. తనను రామాంజనేయులు అవమానిస్తూ మాట్లాడినట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కంతేటి జీవన్‌సాగర్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పద్యనాటకానికి ఊపిరి పోస్తున్న కళాకారుడు

- తండ్రి కోరికపై రంగస్థలం వైపు అడుగులు వేసిన మేరిగె రామలింగేశ్వరరావు
- నేడు అనంతపురంలో బళ్లారి రాఘవ రాష్ట్రస్థాయి పురస్కారం స్వీకరించనున్న కళాకారుడు



మేరిగె రామలింగేశ్వరరావు నాటక ప్రదర్శన



శ్రీకృష్ణుడు ఆహార్యంలో..

తెనాలి: విద్యాధికుడైన తన బిడ్డ మంచి ఉద్యోగం చేయాలని ఆ తండ్రి కోరలేదు. కళాకారుడు కావాలని ఆశపడ్డాడు. తండ్రి కోరిక ప్రకారం రంగస్థల కళాకారుడు కావాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాడు. ఆరిపోతున్న దీపంలాంటి పద్యనాటక రంగంలో కళాకారుడిగా ఉంటే కడుపు నింపదన్న జనాభిప్రాయాన్ని ఖాతరుచేయలేదు. కళల తెనాలిని చేరాడు. పద్యగానాన్ని సాధన చేశాడు. అనతికాలంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేరుగాంచిన పౌరాణిక రంగస్థల నటుడిగా పలు అవార్డులను సాధించాడు. ఈ క్రమంలోనే అనంతపురంలోని లలిత కళాపరిషత్ ఆగస్టు 2న నిర్వహిస్తున్న కళాప్రపూర్ణ బళ్లారి రాఘవ 145వ జయంతి ఉత్సవాల్లో బళ్లారి రాఘవ రాష్ట్రస్థాయి అవార్డును స్వీకరించనున్నాడు. ఆయనే కళాకారుడు మేరిగె రామలింగేశ్వరరావు.

1700లకు పైగా ప్రదర్శనలు..

అయిదారేళ్లలోనే పౌరాణిక నటుడిగా బిజీ అయ్యాడు కళాకారుడు మేరిగె రామలింగేశ్వరరావు. విరామం లేకుండా ప్రదర్శనలిస్తూ వస్తున్నాడు. గత మూడు దశాబ్దాల్లో 1700లకు పైగా ప్రదర్శనలిచ్చారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, భవానీశంక రుడు, బిల్వమంగళుడు, నక్షత్రకుడు, నారదుడు, అర్జునుడు, అలరాజు పాత్రల్లో అవలీలగా నటించగల సామర్థ్యం గల నటుడిగా గుర్తింపును పొందాడు. గయోపాఖ్యానం, తులాభారం, రాయబారం సీన్లలో శ్రీకృష్ణుడిగా ప్రేక్షకులు రామలింగేశ్వరరావును చక్కగా రిసీవ్ చేసుకున్నారు. విద్యాధికుడు కావడంతో పద్యంలోని సాహిత్యాన్ని చాలా స్పష్టంగా సాధారణ ప్రేక్షకులకు సైతం అర్థమయ్యేలా రామలింగేశ్వరరావు రాగసంచారం ఉంటుందని కళాకారులు చెబుతుంటారు. ప్రముఖ నటులైన ఏవీ సుబ్బారావు, పి.లక్ష్మణరావు, ఉప్పలపాటి సైదులు, ఎ.వెంకటేశ్వరరావు, ఎ.కోటేశ్వరరావు, ఉప్పాల నాంచారయ్య, గూడూరు సావిత్రి, అద్దంకి హేమలత, రజనీబాయితో పాటు నేటి తరం నటులతోనూ ఆయన కళావేదికను పంచుకున్నారు.

స్వస్థలం కర్నూలు జిల్లా..

కళాకారుడు మేరిగె రామలింగేశ్వరరావుది కర్నూలు జిల్లా ఆత్మకూరు మండలం కృష్ణాపురం స్వస్థలం. సాధారణ రైతు కుటుంబం. చదువుతూనే నాటకాల్లో చిన్న వేషాలు వేయసాగాడు. తండ్రి నాగలింగస్వామికి కళారంగంపై అపేక్ష. ఆ కారణంగానే కొడుకుతో 5వ తరగతిలో వికర్ణుడు, 8వ క్లాసులో కృష్ణుడు వేషాలను వేయించాడు. యుక్తవయసులో కొందరు యువకులతో కలిసి నాటకం నేర్చుకున్నాడు. అందుకు వినుకొండ నుంచి నీలోజు కోటేశ్వరరావును రప్పించారు. ఆయనే రామలింగేశ్వరరావుకు తొలి గురువు. ఆత్మకూరులో టికెట్ నాటకాన్ని ఆడారు. దూళిపాళ్ల, ఏవీ సుబ్బారావు, అమరవరపు సత్యనారాయణ, నాగరాజు వంటి ప్రముఖులు ఆ నాటకాన్ని తిలకించి రామలింగేశ్వరరావును అభినందించారు. తమతో తీసుకెళ్లి నాటకాలు వేయిస్తామని హామీనిచ్చినా, చదువు పూర్తికాలేదని అంగీకరించలేదు.

కృషికి గుర్తింపుగా సత్కారాలెన్నో..

అనంతపురంలో బంగారు కంకణం, యడవూరులో వెండి ఫ్లూట్, రేగడ గూడూరులో వెండిపళ్లెం, చెరుకుచెర్లలో బంగారు ఉంగరం బహుమతులుగా అందుకున్నారు. 2018లో హైదరాబాద్‌లో శంకర వేదికతో షణ్ముఖి ఆంజనేయరాజు పురస్కారం, 2019లో యువకళావాహిని, హైదరాబాద్‌లో ఈలపాటి రఘురామయ్య అవార్డు, అప్పాజోస్యుల సత్యనారాయణ, పాటిబండ్ల ఆనందరావు, సినీ టుడు బ్రహ్మానందం వంటివారితో సత్కారాలను అందుకున్నారు రామలింగేశ్వరరావు.

తెనాలి ప్రయాణం ఇలా..

కాలేజీ చదువుకొచ్చాక నాటకాలను ఆపేసి, కేవలం కాలేజీ వార్షికోత్సవాలు, అంతర కళాశాలల పోటీల్లోనే ప్రతిభను చాటేవారు రామలింగేశ్వరరావు. ప్రతిసారి బహుమతి తనను వరించేది. శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీలో పాపులేషన్ స్టడీస్‌లో ఎంఏ (1988–90)చేసి, ఉద్యోగ ప్రయత్నాలు ఆరంభించాడు. 'నిన్ను రంగస్థల కళాకారుడిగా చూడాలని ఉంది' అన్న తండ్రి మాటను శిరసా వహించాడు. తెనాలి నటుడు ఎ.దశరథరామయ్య ఆహ్వానంతో ఆయన ట్రూపులో నటించేందుకు 1995లో తెనాలికి వచ్చేడు. నాటకాల్లో నటిస్తూనే సూర్యం మాస్టారు, వీఎస్ ప్రకాశరావు, కె.విశ్వరూపాచారి, డి.శ్రీనివాసరావు వద్ద పద్యగానాన్ని మరింత మెరుగుపరుచుకున్నాడు. ఇక వెనుదిరిగి చూసే అవకాశమే లేదు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



ఎన్నికైన నాయకులను సత్కరిస్తున్న స్వరూపరాణి

తెనాలి టౌన్: భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యులకు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి సూచించారు. శుక్రవారం స్థానిక నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గుంటూరు జిల్లా పార్టీ నూతన కార్యవర్గ సభ్యులుగా ఎన్నికై న టి.రఘు, కె.శ్రీనివాసరావు, శంకరరావులను పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్వరూపరాణి పాల్గొని మాట్లాడారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా పీవీఎన్ మాధవ్ బాధ్యతలు చేపట్టాక ఈ నెల 5వ తేదీన గుంటూరు జిల్లాకు వస్తున్నట్లు తెలిపారు. పార్టీలో నూతన పదవులు చేపట్టిన జిల్లా సభ్యులు పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజే రామకృష్ణ, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కె.వాసుదేవనాయుడు, నంద కిషోర్, ఎం.మురళీ, వి.సందీప్‌రాజు, సీహెచ్.విజయభాస్కర్‌రెడ్డి, అడపా సంపత్‌రాయుడు, అన్నవరపు వేణు, ఎస్.రవీంద్ర, అడుసుమల్లి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



తెనాలి కొత్తపేటలోని అష్టలక్ష్మీ దేవాలయంలో



గజలక్ష్మిగా మారీసుపేటలోని శ్రీబాలత్రిపురసుందరి



రామలింగేశ్వరపేటలోని అమ్మవారు

శుభములీ.. శ్రావణలక్ష్మీ!

శ్రావణమాసం.. అందులోనూ శుక్రవారం కావడంతో స్థానిక దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో కొలువైన అమ్మవార్లను విశేషంగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. శ్రావణమాసంలో నిర్వహించే పూజల వల్ల సత్ఫలితాలు పొందుతారని.. మహిళలు సౌభాగ్యవంతులు అవుతారని వేదబ్రాహ్మణులు పేర్కొన్నారు.

– తెనాలి

అర్హులకు పింఛన్లు పంపిణీ



8వ వార్డులో పింఛను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలి అర్బన్: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం తెనాలి పట్టణంలో శుక్రవారం ఉదయం నుంచి ప్రారంభమైంది. తెనాలి పట్టణం 47 సచివాలయాల పరిధిలోని ఉద్యోగులు ఉదయం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను పంపిణీ చేశారు. అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు సాధారణ బదిలీలు నిర్వహించిన విషయం తెలిసిందే. దీంతో 5 ఏళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగి ఇతర సచివాలయాలకు బదిలీ అయ్యారు. దీంతో లబ్ధిదారుల నివాసాలు తెలియక, హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో ఇబ్బందులు ఏర్పడడం వల్ల పంపిణీ కొంత ఆలస్యమైంది. ఉద్యోగులు ఇళ్లకు రాకపోవడంతో లబ్ధిదారులు కొందరు సచివాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. 94.54 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని అధికారులు పేర్కొన్నారు. మిగిలిన వాటిని శనివారం పంపిణీ చేస్తామని తెలిపారు.

తెనాలి రూరల్: పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని రూరల్ మండలం అంగలకుదురు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఊసరపు రాజ్యలక్ష్మి, ఉప సర్పంచ్ కనగాల నాగభూషణం, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కటారి వాసుదేవ నాయుడు, గ్రామ టీడీపీ అధ్యక్షులు కనగాల శ్రీనివాసరావు, తెనాలి రూరల్ మండల భాజపా అధ్యక్షులు కడియాల నందకిషోర్, ఊరిటి శ్రీనివాస్, నలుకుర్తి అశోక్, ఎం.వీరయ్య, పంచాయతీ సెక్రటరీ అనిల్, తదితరులు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. పెదరావూరులో నూతన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి పి.దానయ్య, కారుమంచి శ్రీనివాస్, జాస్తి నరేంద్ర, డి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో మ్యూటేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా



మ్యూటేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ అలీమ్ బాషా

తాడేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఆటో మ్యూటేషన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా కోరారు. మంగళగిరి పట్టణ పరిధిలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం ఆటో మ్యూటేషన్ ప్రక్రియను జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కె. బాలగురవయ్యతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పురపాలక, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖల సమన్వయంతో ఏర్పాటు చేసిన ఆటో మ్యూటేషన్‌తో ఆస్తి పన్నుల వివరాల్లో మార్పుల ప్రక్రియ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈ విధానం ద్వారా యజమాని పేరు మార్పులు చేయించుకోవచ్చని వివరించారు. గతంలో అమ్మిన, కొన్న వారి పేర్లు మార్చుకునేందుకు నగరపాలక సంస్థ, రిజిస్ట్రేషన్ కార్యాలయాలని తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ విధానానికి స్వస్తి పలుకుతూ మ్యూటేషన్ ద్వారా రిజిస్ట్రేషన్ తరువాత ఆస్తి వివరాలు, పన్నుల నమోదు,ప్రాపర్టీ టాక్స్‌ల రికార్డులు తక్కువ సమయంలో చేరతాయని చెప్పారు. ప్రజలకు సమయం ఆదా అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవిన్యూ అధికారి మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాల పంపిణీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీఐటీయూ నాయకులు

తాడేపల్లి రూరల్: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీఐటీయూ నాయకులు శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని గుండిమెడలో కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామస్తులకు స్మార్ట్ మీటర్ల వల్ల అనర్థాలను వివరించారు. సీఐటీయూ తాడేపల్లి మండల నేత దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న నారా లోకేష్ స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించారని, మీటర్లను పగలకొట్టాలని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. నేడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మోదీ విధానాలను అమలు చేస్తూ, ప్రజలపై విద్యుత్ భారాలు వేస్తోందని తెలిపారు. స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను ప్రజలందరూ వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆగస్టు 5న జరిగే నిరసనలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూతాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ, కేవీపీఎస్ నాయకులు నాగపోగు విజయరాజు, జి. బాలు, పాటిబండ్ల సత్యనారాయణ, నాగరాజు, ఏసుపాదం, రవి పాల్గొన్నారు.

మేడికొండూరులో..

ఇళ్లకు స్మార్ట్ మీటర్లు వ్యతిరేకిస్తూ సీపీఎం మండల కార్యదర్శి రామకృష్ణ శనివారం ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండని ప్రచారం చేశారని గుర్తు చేశారు.ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటినే ప్రభుత్వ ఆఫీసులు, వ్యాపార సంస్థలకు బిగించారని మండి పడ్డారు. ఇప్పుడు ఇళ్లకు కూడా బిగించేందుకు సిద్ధమయ్యారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా పూర్తిగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఏదైనా విద్యుత్ సమస్యపై ఫిర్యాదు చేయాల్సి వస్తే ఎక్కడకు వెళ్లి చేయాలో తెలియని పరిస్థితి వస్తుందని వివరించారు. అనంతరం స్మార్ట్ మీటర్లు బిగించ వద్దంటూ ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. అనంతరం మేడికొండూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అధికారులకు అందించి, నిరసన వ్యక్తం చేశారు.

7న విజయవాడలో ఎంఎస్ స్వామినాథన్ శత జయంతి సభ

తెనాలి: హరిత విప్లవకారుడు, జాతీయ రైతు కమిషన్ చైర్మన్ ఎంఎస్ స్వామినాథన్ శత జయంతిని ఈనెల 7వ తేదీన విజయవాడలో నిర్వహించనున్నారని.. ఆంధ్రప్రదేశ్ రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతుల సంఘాల ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు సభ జరుగుతుందని శుక్రవారం రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములక శివసాంబిరెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, ఆచార్య రంగా యూనివర్సిటీ ప్రత్యేక శాస్త్రవేత్త జీఎంవీ ప్రసాద్, విశ్రాంత శాస్త్రవేత్త ఎస్.వేణుగోపాలరావు, వ్యవసాయశాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం , ఏపీ రైతు సంఘం, కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కె.ప్రభాకరరెడ్డి, వి.వెంకటేశ్వర్లు, కేవీవీ ప్రసాద్, ఎం.హరిబాబు తదితరులు పాల్గొంటారని.. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

తెనాలి టౌన్: తెనాలి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీ అయిన అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో విజయగౌరి పేర్కొన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడారు. ప్రాజెక్టు పరిధిలో 7 అంగన్‌వాడీ ఆయా పోస్టులు, ఒక టీచర్ పోస్టుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆమె తెలిపారు. అర్హత 10వ తరగతి పాసై ఉండాలని.. 21 నుంచి 35 ఏళ్ల వయస్సు, వివాహం అయ్యి ఉండాలని.. స్థానికత ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ పోస్టు కోపల్లె, ఆయా పోస్టులు సిరిపురం, అన్నవరం, కొలకలూరు, కోపల్లె, తెనాలి టౌన్ 14వ వార్డు, 31వ వార్డు, 38వ వార్డు పరిధిలో భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు స్థానిక గ్రామ, వార్డు సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలను సంప్రదించి దరఖాస్తు చేసుకునేందుకు పూర్తి సమాచారం తెలుసుకోవాలని ఆమె కోరారు.

ప్రత్యేక అవసరాలు గల చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ



ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు, తల్లిదండ్రులకు భోజనం అందిస్తున్న ఎంఈఓ కెన్నడీ

కాకుమాను: ప్రత్యేక అవసరాలు ఉన్న చిన్నారుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్.కెన్నడీ అన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్.ఈ.పీ.2020)ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పెదనందిపాడులో శుక్రవారం సమగ్ర శిక్ష గుంటూరు ఆధ్వర్యంలో 18 సంవత్సరాలలోపు ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఉచిత అంగవైకల్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను చులకనగా చూడకుండా వారు ఎంచుకున్న రంగాల్లో రాణించే విధంగా తల్లిదండ్రులతోపాటు సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. ముఖ్యంగా తల్లిదండ్రులు వారి పట్ల ప్రతి రోజూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారిలో మనోధైర్యాన్ని నింపాలని తెలిపారు. శిబిరంలో ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 పి.జాకబ్, ఐఈడీ జిల్లా కో–ఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు, ఐఈఆర్టీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల తయారీతో అధిక ఆదాయం

సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గంగాదేవి



పుట్టగొడుగుల తయారీని వివరిస్తున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం గంగాదేవి

గుంటూరు రూరల్: గుంటూరు నగర శివారులోని లాంఫాంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో గ్రామీణ యువతకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో శుక్రవారం కోర్స్ డైరెక్టర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం గంగాదేవి మాట్లాడుతూ పుట్టగొడుగుల స్పాన్ ఎలా తయారు చేయాలో వివరించారు. పాల పుట్టగొడుగులు, ఆయిస్టర్, వరిగడ్డి, బటన్ పుట్టగొడుగుల తయారీ, వాటి పోషక విలువలు ఆరోగ్య ప్రయోజనాలు, మార్కెట్ డిమాండ్ గురించి వివరించారు. వీటిలో ప్రొటీన్స్ (19– 35%) వరి, గోధుమ, కూరగాయల కంటే అధికంగా ఉంటాయని, పొటాషియం, సోడియం నిష్పత్తి, పీచు పదార్థాలు అధికంగా ఉండడం వల్ల అధిక రక్తపోటు (బి.పి.), అధిక ఆమ్లత (అసిడిటి) వల్ల బాధపడేవారికి చాలా బాగా ఉపయోగపడుతాయన్నారు. పుట్టగొడుగులలో కొవ్వు పదార్థాలు తక్కువగా వుంటాయని, తాజా పుట్టగొడుగులలో విటమిన్–డి అధికంగా ఉంటుందని తెలిపారు. పుట్టగొడుగుల తయారీకి ఎక్కువ పెట్టుబడి అవసరం లేదని, పుట్టగొడుగులను 35–40 రోజులలో పెంచవచ్చన్నారు. ఇంటి ఆవరణంలో కూడా వీటిని సులభంగా పెంచవచ్చని, అధిక దిగుబడులు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. పంట అయిపోయిన తరువాత దిండ్లను ఎరువుగా లేదా బయోగ్యాస్ తయారీకి వాడుకోవచ్చని, గ్రామీణ నిరుద్యోగ యువత, మహిళలు, సన్నకారు రైతులు పుట్టగొడుగుల పెంపకాన్ని చేపట్టినట్లయితే అధిక దిగుబడులను పొందడమే కాకుండా, ఉపాధిని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

తాడికొండ: మండలంలోని లాంలో గుర్తు తెలియని వృద్ధుడు శుక్రవారం రోడ్డు పక్కన మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె. వాసు తెలిపారు. 70–75 సంవత్సరాల వయస్సున్న వృద్ధుడు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ రోడ్డు పక్కన పడి ఉన్నట్లు వీఆర్వో మధుసూదనరావు ఫిర్యాదు చేశారన్నారు. ఒంటిపై గళ్ల లుంగీ, తెల్లటి షర్టు, మెడపై టవల్ ఉందని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ సూచించారు.

కిట్స్‌లో ముగిసిన అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కిట్స్)లో ఐదు రోజులుగా జరుగుతున్న అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. జేఎన్‌టీయూకె సహకారంతో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో సిద్ధాంత పాఠాలు, హ్యాండ్స్–ఆన్ సెషన్లు, సిమ్యులేషన్లతో కూడిన ఆధునిక ఏఐ టెక్నాలజీలు, డేటా అనలిటిక్స్, మోడల్ ఆప్టిమైజేషన్ వంటి అంశాలపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ఏఐ రంగంలో తాజా పరిశోధనలు, ఆవిష్కరణలు, వైద్యం, పరిశ్రమ, వ్యవసాయం వంటి విభిన్న రంగాల్లో అనువర్తనాలపై శిక్షణ ఇచ్చారు. భవిష్యత్తులో ఏఐలో క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రాధాన్యతను వివరించారు. ఎఫ్‌డిపికి రిసోర్స్ పర్సన్లుగా డాక్టర్ తరుణ్‌కుమార్‌రెడ్డి (ఐఐటీ రూర్కీ), డాక్టర్ గౌరవ్ కుమార్‌నాయక్ (ఐఐటీ రూర్కీ), డాక్టర్ రామ్ బిలాస్ పచోరి (ఐఐటీ ఇండోర్), డాక్టర్ రవికుమార్ (ఎన్ఐటి వరంగల్), డాక్టర్ సరళ పచ్చల (కిట్స్)లు వ్యవహరించారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, కార్యదర్శి కోయి శేఖర్‌లు పాల్గొన్నారు. అధ్యాపకులు ఎఫ్‌డీపీలో నేర్చుకున్న అంశాలు విద్యారంగ అభివృద్ధికి తోడ్పడేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.

5న పాలిటెక్నిక్ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

పొన్నూరు: పట్టణంలోని ఇటికంపాడు రోడ్డులో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ ప్రవేశాలకు ఈ నెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ప్రసన్న రాణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు.